క్లుప్తంగా

మెపా మండల కమిటీ ఎన్నిక



నియామకపత్రాలు అందుకుంటున్న సభ్యులు

నవాబుపేట: నవాబుపేట మండల మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) కమిటీని జిల్లా అధ్యక్షుడు శేరి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య సమక్షంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా నవాబుపేటకు చెందిన తెలుగు క్రిష్ణ, వట్టిమీనపల్లికి చెందిన వెంకటయ్యను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మండలాధ్యక్షుడు క్రిష్ణ మాట్లాడుతూ.. ముదిరాజ్ అభివృద్ధికి, రిజర్వేషన్ల సాధనకు రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విజయ్ కుమార్, మధు, లక్ష్మణ్ తదితరులున్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా లక్ష్మీకాంత్‌రెడ్డి



యాలాల: బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా కమాల్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని మండల అధ్యక్షుడు మహిపాల్ అందించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీకి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో యువతను ఏకతాటిపైకి తెచ్చి పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తనకు మండల ఉపాధ్యాక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన సుధాకర్‌రెడ్డి



రేవంత్‌రెడ్డిని సన్మానించిన సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి.. మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. వికారాబాద్‌లో ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాంపూర్ గ్రామ చెరువు సంఘం ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న తిరుపతయ్య

కుల్కచర్ల: రాంపూర్ గ్రామ చెరువు సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన చెక్కల తిరుపతయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా మత్స్య సహకార శాఖ ఆధ్వర్యంలో కుల్కచర్ల మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం గ్రామ పరిధిలోని చెరువుకు సంబంధించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చెక్కల తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం ఎన్నికయ్యారు. మత్స్యసహకార శాఖ జిల్లా కోఆర్డినేటర్ నరేందర్ నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలను అందించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ రవీందర్

పరిగి: కాలనీల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ రవీందర్ సూచించారు. పట్టణ కేంద్రంలోని 4వ వార్డులో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని విన్నవించడంతో శుక్రవారం కాలనీలో జేసీబీతో డ్రైనేజీ పనులను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే సహకారంతో అధిక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీవాసులు లక్నాపూర్ శ్రీనివాస్, రూప్‌సింగ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

బొంరాస్‌పేట: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సర్పంచ్ జయమ్మ అన్నారు. మండల కేంద్రంలోని క్రిష్ణానగర్‌లో శుక్రవారం ఆమె అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. అంబలి కేంద్రంతో వేసవిదాహం తీర్చుకోవాలని నిర్వాహకులు వీరేశలింగం అన్నారు. కాగా సర్పంచ్ తన సొంత ఖర్చుతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.

14 ఏళ్లుగా ఎదురుచూపులే

- 2009లో కాగ్నా ఉపనదిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
- ఇప్పటికీ పూర్తికాని వైనం
- త్వరగా పూర్తిచేయాలంటున్న ప్రయాణికులు, స్థానికులు





కాగ్నా ఉపనదిపై అసంపూర్తిగా వంతెన నిర్మాణం, (ఇన్‌సెట్‌లో) 2009లో మంత్రి సబితారెడ్డి వేసిన శిలాఫలకం

ధారూరు: ఉమ్మడి రాష్ట్ర హయాంలో గిరిజన సంక్షేమ శాఖ నిధులతో చేపట్టిన వంతెన పనులు 14 సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికాకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి మంత్రి సబితారెడ్డి వేయించిన శిలాఫలకం ఎప్పుడో కనుమరుగైంది. స్థానిక సర్పంచ్, ప్రజలు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. వివరాల్లోకి వెళ్తే.. ధారూరు మండల పరిధిలోని చింతకుంట గ్రామం నుంచి ధారూరు పీడబ్ల్యూడీ రోడ్డు మధ్యలోని కాగ్నా ఉపనదిపై వంతెన నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ రూ.50 లక్షలు మంజూరు చేసింది. అప్పటి గనుల, భూగర్భ జలవనరుల శాఖ మంత్రి, ప్రస్తుత విద్యాశాఖమంత్రి సబితారెడ్డి 2009 ఫిబ్రవరి 2న పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో మంత్రి మాట్లాడుతూ.. 2010లోపు పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ధారూరు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చింతకుంట గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. కానీ వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ తిరుగాల్సి ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. 3 కిలోమీటర్ల దూరానికి బదులుగా.. చింతకుంట నుంచి హరిదాస్‌పల్లి మీదుగా ధారూరు 6 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. వంతెన పూర్తయితే కేవలం 3 కి.మీ ప్రయాణంతో మండలానికి చేరుకోవచ్చని పేర్కొంటున్నారు. అధికారులకు, నాయకులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటే అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యే అవవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మాణం పూర్తిచేయాలి



స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని వంతెన పనులను పూర్తి చేయించాలి. స్వరాష్ట్రంలో కూడా వంతెన పనులకు మోక్షం లభించలేదు. అప్పటి, ఇప్పటి మంత్రి పి.సబితారెడ్డికి విన్నవిస్తూ వస్తున్నాను. తగిన నిధులు కేటాయిస్తామని చెబుతున్నారే తప్పా ఎలాంటి పురోగతి లేదు. ఇప్పటికైన నిధులు కేటాయించి పనులు పూర్తిచేసి రాకపోకలకు సౌకర్యం కల్పించాలి.

– వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, చింతకుంట

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

యాలాల: హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని హాజీపూర్ శివారులో గల బాకారం ఆంజనేయస్వామి ఆలయ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. చుట్ట పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో బాణాసంచాను కాల్చారు. ఉత్సవాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీక్రిష్ణగౌడ్, యాలాల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులను హాజీపూర్ సర్పంచ్ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు.

ఎంపీపీ అన్నదానం..

ఆంజనేయస్వామి జాతరలో భాగంగా యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా శుక్రవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఏడాది తనవంతుగా భక్తులకు అన్నదానం నిర్వహిస్తుంటారు. అంతకుముందు ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు బస్వరాజ్, క్రిష్ణ, రాజేందర్, అశోక్, చందు తదితరులు ఉన్నారు.

తిరుపతిరెడ్డికి ఖురాన్ బహూకరణ



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

కొడంగల్: పట్టణంలోని మక్కా మజీద్‌లో పవిత్ర దివ్య ఖురాన్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డిని మజీద్‌కు ఆహ్వానించి మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఖురాన్‌ను అందించారు. మజీద్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా ప్రతి ఏడాది రంజాన్ మాసంలో నియోజకవర్గంలోని ప్రముఖులకు ఖురాన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇస్లాం మతం గురించి వివరించారు. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ ఉపసర్పంచ్ గౌసన్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కరీం, నయీమ్, ఆసిఫ్‌ఖాన్, ఖాసీం, అస్మత్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ఎస్‌ఐ సంతోష్‌కుమార్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

ధారూరు: తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం దారిలో వెళ్లేవారి దాహార్తిని తీరుస్తుందని ధారూరు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అన్నారు. గట్టెపల్లి గ్రామానికి చెందిన దివంగత భీమయ్య పేరుతో కొడుకు పెంటయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎస్‌ఐ ప్రారంభించారు. రోడ్డు మార్గాన వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు, వాహనదారులు, ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని అన్నారు. మండుతున్న ఎండలకు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రతిఒక్కరికి దాహం వేస్తుందని.. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ కేంద్రం తాగునీటిని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చలివేంద్ర నిర్వాహకులు పెంటయ్య, ఏఎస్‌ఐ మురళి, పాస్టర్ నెహమియా, రాములు, ఆనంద్, రాయల్, మల్లేశ్, లాలనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో అశోక్‌గౌడ్, ముస్లింలు

యాలాల: మండలంలోని ముద్దాయిపేటలో శుక్రవారం స్థానిక బీఆర్‌ఎస్ యువ నాయకుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. స్థానిక జామియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్ష పాటిస్తున్న ముస్లింలకు అశోక్‌గౌడ్ ఖర్జూర పండ్లను తినిపించి దీక్ష విరమింపచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీదు సదర్ బషీరుద్దీన్, మైనార్టీ నాయకులు వాసిద్‌ఖాన్, ఆరీఫ్ హుస్సేన్, సిరాజుద్దీన్, జహంగీర్, యాసర్, మహ్మద్‌ఖాన్, అహ్మద్, షాహెద్ తదితరులు ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలపై ఫిర్యాదు



ఎస్‌ఐ ప్రణయ్‌తేజ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మొయినాబాద్: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ఎస్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు మొయినాబాద్ ఎస్సై ప్రణయ్‌తేజ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్‌లో ఎలాంటి అనుమతులు లేకున్నా శ్రీ చైతన్య పేరిట పాఠశాల నడుపుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విద్యాశాఖ, పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మణికంఠ, అజయ్, వికాస్, సాయి, చైతన్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

మర్పల్లి: నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలను ఆశించకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టిసారించి ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కలీమొద్దీన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కల్‌ఖోడ గ్రామానికి చెందిన మహ్మద్ ఖదీర్, మహ్మద్ హాజీ (అన్నదమ్ములు) మండల కేంద్రంలో యూనివర్సెల్ మొబైల్, ఎలక్ట్రానిక్స్ దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ దుకాణాన్ని శుక్రవారం కలీమొద్దీన్ ప్రారంభించారు. స్వయం ఉపాధితో ఎదగాలన్నారు. డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్తా, మండల కోఆప్షన్ సభ్యుడు సోహెల్, మర్పల్లి మార్కెట్ కమిటీ డైరక్టర్ గౌస్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సలీం, మర్పల్లి మాజీ ఉప సర్పంచ్ జాఫర్, కల్‌కోడ సర్పంచ్ శివకుమార్, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, ఆయా రాజకీయ పార్టీల నాయకులు శ్రీనివాస్ గుప్తా, శేఖర్‌గుప్తా తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్పల్లి: మండల పరిధిలోని పంచలింగాల గ్రామానికి చెందిన అక్మయ్య (54) గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి మృతుడి అంత్యక్రియల కోసం రూ.5 వేలు స్థానిక సర్పంచ్ సురేందర్‌రెడ్డి, మర్పల్లి సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. పరామర్శించిన వారిలో రమేష్, మల్లేశం, గ్రామస్తులు ఉన్నారు.

చిట్లపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



చిట్లపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో తిరుపతిరెడ్డి

కొడంగల్: గిరిజనుల ఆరాధ్య దైవమైన బాహోజీ జాతర, మండల పరిధిలోని చిట్లపల్లి జాతర(దర్గా)లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు యూసూఫ్, ప్రశాంత్, నయీమ్, ఆసీఫ్‌ఖాన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించరూ..



5వ వార్డులో ఇళ్లమధ్య పోగైన చెత్త

పరిగి: ఇళ్ల మధ్యలో చెత్త చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ కేంద్రంలోని 5వ వార్డు అలీహుస్సేన్ కాలనీ ప్రధాన రోడ్డుకు పక్కన ఓ ఖాళీ ప్లాటులో స్థానికులు చెత్తను విపరీతంగా డంప్ చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి చెత్త నుంచి దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మున్సిపల్ కార్మికులకు, సిబ్బందికి ఎంత చెప్పినా చెత్తను తొలగించడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారు

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: 'బీజేపీ హఠావో దేశ్ బచావో' అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. శుక్రవారం తాండూరులో పీర్ మహ్మద్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. లాభాల బాటలో కొనసాగుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తుల కోసం ప్రైవేటీకరించడం గర్హనీయమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా కలిసి బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగానే ఈనెల 9వ తేదీన సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రజలంతా కలిసిరావాలని ఆమె కోరారు. అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడం విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 9న జరుగనున్న బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, బషీర్, పీర్ మహ్మద్, వెంకటేష్, నారాయణ, మైమూద్, అనంతయ్య, నర్సింహులు, అబ్దుల్లా, రవీందర్, మునీర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్ శర్మకు ఉత్తమ పురోహిత రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న శర్మ

మర్పల్లి: మర్పల్లి గ్రామానికి చెందిన కేవీఎస్ శర్మ శుక్రవారం ఉత్తమ పురోహిత రత్న బిరుదును అందుకున్నారు. వివరాలు... శిఖరం ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో శోభకృత నామ సంవత్సర ఉగాది పురస్కారాలను హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాజ మండపంలో ఉగాది నంది పురస్కారం, వైదిక పురోహిత రత్న బిరుదులను రాష్ట్ర ముఖ్య సలహాదారుడు సముద్రాల వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర ట్యూరిస్టు డెవలప్‌మెంట్ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, జనగామ స్పెషల్ కలెక్టర్ అరుణారెడ్డితో పాటు వేద పండితులు శ్రీవేలంకి కృష్ణ శర్మ చేతుల మీదుగా మర్పల్లి గ్రామానికి చెందిన కేవీఎస్ వినోద్ శర్మకు ఉత్తమ వైదిక పురోహిత రత్న, నంది అవార్డును అందజేశారు. హిందు ధర్మ పరిరక్షణకు, కంకణ బద్ధులమై దేశ సంసృతి సాంప్రదాయాల పరిరక్షణకు కృషిచేస్తున్న తమ వేద పండితులకు సేవా సంఘం నాయకులకు ఉగాది నంది–ఉగాది జాతీయ పురస్కారాలు ప్రదానం చేసిన శిఖరం ఆర్ట్ థియేటర్ యజమాన్యంకు తాను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వినోద్ శర్మ తెలిపారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్



బొంరాస్‌పేట: మహంతీపూర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దౌల్తాబాద్: గిరిజన మహిళలతో మాట్లాడుతున్న నాయకులు

హాత్ సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేతలు

బొంరాస్‌పేట: మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు 'హాత్‌సే హాత్ జోడో' కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని మహంతీపూర్‌లో 'హాత్‌సే హాత్‌జోడో'లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను విస్మరించారని అన్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, జయక్రిష్ణ, అంజిల్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ నర్సిములు నాయుడు, సర్పంచ్ మహిపాల్, మాజీ సర్పంచ్ మొగులయ్య, నాయకులు కిష్టప్ప పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి..

దౌల్తాబాద్: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. హాత్‌సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పోల్కంపల్లి, సేవ బండతండాలో ఆయన పర్యటించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఎన్నికలకు వస్తున్నాయని వారి ఎలాగైనా ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, కుర్మని దస్తప్ప, సత్యపాల్, రాజు, వీరన్న, చరణ్, కృష్ణ, మహిపాల్, సాయిలు తదితరులున్నారు.

శరవేగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు



ఎన్కేపల్లిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

మోమిన్‌పేట: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద 2022–23 సంవత్సరానికి గాను మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల పనుల నిర్మాణం చేపట్టారు. మార్చి నెల ముగింపు వరకు పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాని కొన్ని గ్రామాల్లో సమయానికి కూలీలు, యంత్రాలు దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రం మొత్తంలో ఒకే నెలలో సీసీ పనులు పూర్తి చేయాల్సి ఉండటంతో కూలీలకు, యంత్రాలకు డిమాండు బాగా పెరిగింది. మిగిలిపోయిన పనులకు ఉన్నాతాధికారుల నుంచి అనుమతులు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు. మండల పరిధిలోని ఎన్కేపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.47లక్షలు మంజూరయ్యాయి. సమయానికి కూలీలు, యంత్రాలు దొరక్క సగం పనులే చేశారు. మిగతా పనులను ప్రస్తుతం చేస్తున్నారు.

గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు



అనంతగిరి: ఏసు కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు



కొడంగల్: మెథడిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



అనంతగిరి: ఇమాన్యుయేల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కొడంగల్: పట్టణంలోని ప్రార్థనా మందిరాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్టియన్ సోదరులు కుటుంబ సమేతంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుడి మందిరంలో అందరూ సమానమేనని అన్నారు. పట్టణంలోని మెథడిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వికారాబాద్ మండలంలో..

అనంతగిరి: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో..

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు జీసస్ శాంతి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.